నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

1

సోమవారం | నవంబర్ 18, 2024 | www.navatelangana.com

డీఎస్‌పీ మండల కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్‌పీ) నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు గణేష్ మహరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా కొండమడుగు గణేష్, ఉపాధ్యక్షులుగా పెందుర్తి జల్దేవ్, కలిగేటి ప్రవీణ్, కుందూరు సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కార్యదర్శులుగా రాథోడ్ నరేందర్, బీక్క రాకేష్, కోశాధికారిగా రాకేష్, సభ్యులుగా జూకంటి ప్రవీణ్ కుమార్, కుందూరు రాకేష్, కొండమడుగు హరీష్, ఉల్ల రఘువీర్, కార్తీక్, మనాల గోపాల్, శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ఇంధన్‌పల్లి అడవి రేంజి పరిధిలోని వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని ఇంధన్‌పల్లి రేంజ్‌కు తరలించినట్టు ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైగర్ రిజర్వు ఫారెస్ట్ నుంచి ఎలాంటి ఇసుక మట్టి కలప అక్రమంగా తరలిస్తే అటవీ చట్టం ప్రకారం కఠినంగా శిక్షలు ఉంటాయన్నారు. అడవిలో ఉన్న వాగులు, వంకల నుంచి ఇసుకను తరలించడం నేరమన్నారు. తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అతిథులొచ్చారు.. అలజడి మొదలైంది..!

• ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సంచరిస్తున్న పెద్ద పులులు • ఆవాసాలు వెతుకుంటూ అంతర్‌రాష్ట్ర సరిహద్దుల మీదుగా రాకపోకలు • పంట పొలాలకు వెళ్లేందుకు అటవీ సమీప గ్రామాల్లో భయం

అడవుల జిల్లాగా పేరొందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పూర్వవైభవాన్ని సంతరించుకుంటోంది. గత 15 సంవత్సరాలుగా రక్షిత అటవీ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించిన అటవీశాఖ చేస్తున్న కృషి ఫలిస్తోంది. అటవీ అభివృద్ధికి వీలుగా ఆదిలాబాద్ సర్కిల్, కవ్వాల్ రిజర్వుడ్ సర్కిల్‌గా సంరక్షణ చర్యలు చేపట్టిన అటవీశాఖ గత నాలుగు దశాబ్దాల క్రితం ఉన్నటువంటి వాతావరణం ఇప్పుడు కన్పిస్తోందనిస్తోంది. ఆ రోజుల్లో కన్పించిన పెద్ద పులుల కదలికలు ఇప్పుడు కన్పిస్తుండటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. కాగా సరిహద్దు రాష్ట్రాల్లో పులుల సంతతి పెరిగి ఆవాసాలు అవసరమై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు వస్తున్నాయి. అతిథితులను ఆదిలాబాద్ జిల్లా అడవులు ఆహ్వానిస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో పెద్దపులుల సంచారం కనిపిస్తుండటం ప్రాధాన్యం సంతరించుకుంటే.. పులుల రాకతో జిల్లావాసుల్లో భయాందోళ రేకెత్తిస్తోంది.

నవతెలంగాణ-జైపూర్

ఆవాస యోగ్యంగా తయారైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవులు జంతుజాలానికి ఆలవాలంగా మారుతున్నాయి. జిల్లా పరిధిలో అప్పుడప్పుడు కొన్ని రోజుల పాటు నివాసం ఏర్పాటుచేసుకొని వెళ్లిపోతున్న పులులతో పాటు ప్రతి ఏటా శీతాకాలంలో అతిథులుగా వచ్చే పెద్ద పులులతో అటవీ ప్రాంతాల్లో అలజడి మొదలైంది. ఉమ్మడి జిల్లాలో విస్తారమైన అటవీ ప్రాంతాలు ఉండటం.. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అటవీ ప్రాంతాల గుండానే వెళ్లేందుకు అనువైన పరిస్థితులు ఉన్న కారణంగా పులులు ఇక్కడి అడవులపై మక్కు పెంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకటికొకటి తోడును వెతుక్కుంటూ వస్తున్న నేపథ్యంలో పులుల సచారం అధికమవుతోంది. సాధారణంగా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈ క్రతువు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిన్నటి వరకు నిర్మల్ జిల్లాలో సంచరించిన పెద్దపులి తాజాగా సిర్‌చెల్మ (ఉట్నూర్) ఏరియాకు చేరినట్లు తెలుస్తోంది. పెంచికల్ పేట్ ఏరియాలో గత 6 సంవత్సరాలుగా స్థిర నివాసమై ఉంటున్న కే.8 పెద్ద పులితో పాటు మంచిర్యాల-లక్షెటిపేట్ ఏరియాలో-1, సిర్పూర్ ఏరియాలో- 2, కాగజ్‌నగర్ ఏరియాలో-2 జోడేఘాట్ ఏరియాలో-1, పెద్దపులుల సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా జిల్లా పరిధిలో సంచరిస్తున్న పెద్ద పులులకు ఎలాంటి హాని కలుగకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో పాటు పులుల సంచారం, రాకపోకల తీరును పర్యవేక్షిస్తున్నారు. పులుల రాకపోకల నేపథ్యంలో వివిధ చోట్ల కెమెరాలు ఏర్పాటుచేసి వాటి ఆరోగ్య పరిస్థితులు, రక్షణ చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతున్నారు. జిల్లా పరిధిలో పెద్దపులుల సంతానోత్పత్తి, ఇతర ప్రాంతాల నుండి వచ్చేపోయే పులులు జిల్లా పరిధిలో స్థిర నివాసాలను ఏర్పాటు చేసుకునేందుకు ఉమ్మడి జిల్లా పరిధి అడవులు ఆవాసయోగ్యంగా ఆహ్వానిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. కాగా ఏ1, ఏ2 పెద్దపులులు గత కొంత కాలంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అటవీ ప్రాంతానికి అతిథులుగా వచ్చిపోతుండగా ప్రస్తుతం నిర్మల్ డివిజన్ ఏరియాలో సంచరించిన పులికి సంబంధించిన సమాచారం ఇవ్వడానికి అధికారులు ముందుకు రావడం లేదు. కాగా మంచిర్యాల డివిజన్ పరిధి చెన్నూర్ సబ్ డివిజన్ పరిధిలో భీమారం, నెన్నెల, కొత్తూరు సరిహద్దుల మీదుగా పులుల రాకపోకలకు అవకాశం ఉంది..





ఆవాసయోగ్యంగా ఉమ్మడి జిల్లా అడవులు

క్రమ క్రమంగా పులులు వృద్ధి చెందుతుండటంతో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవాల్సిన సంధర్భంలో పులులు అంతరాష్ట్ర సరిహద్దుల మీదుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు పులులు రాకపోకలు కొనసాగిస్తున్నట్లు అటవీ అధికారులు భావిస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ డివిజన్ మూల కేంద్రంగా ఇతర రాష్ట్రాల నుండి పెద్దపులుల రాకపోకలు కొనసాగుతుండగా తిప్పేశ్వర్ నుండి జిల్లా పరిధిలోకి వచ్చే పులులు జిల్లా వ్యాప్తంగా సంచరిస్తుంటాయని తెలుస్తోంది. తడోబాలో వందకు మించిన పులులు ఉండటంతో అక్కడి నుండి ఇటువైపు రావడమే కాకుండా ఇక్కడే స్థిర నివాసమై ఉండే అవకాశం ఉన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాగా కాగజ్‌నగర్ మూల కేంద్రంగా తిర్యాని-జక్కాపూర్, మాలిని, ఆసిఫాబాద్, రాజూరా-వాంకిడి, గూడెం-చెప్రాల, ఆళ్లపల్లి, వట్రా కారిడార్ల మీదుగా పులులు రాకపోకలు సాగిస్తున్నట్లు అభిప్రాయపడుతున్నారు. పులుల రాపోకలతో పాటు స్వేచ్ఛగా అటవీ ప్రాంతంలో సంచరించేందుకు ఉమ్మడి జిల్లా అటవీ ప్రాంతంలో అటవీశాఖ పటిష్టమైన చర్యలు చేపడుతోంది..

ఆడ పులుల ఆవాసం 10-30 చదరపు కిలో మీటర్లు

ఆడ పులులు ఆవాసంగా తనకుతానుగా గుర్తించుకున్న నివాసంలో అవసరమై ఉంటుంది. సాధారణంగా 10 నుండి 30 చదరపు కిలో మీటర్ల పరిధిలో ఆడ పులి ఆవాసంగా ఏర్పాటు చేసుకుని నివాసమైవుంటుంది. మగ పులి 100 చదరపు కిలో మీటర్ల పరిధిలో 3 నుండి 4 ఆడ పులుల ఆవాస ప్రాంతాల మీదుగా సంచరిస్తూ ఉంటాయి. కాగజ్‌నగర్ ఏరియా పరిధిలో స్థిర నివాసమైవుంటున్న కే-8 ఆడ పులితో పాటు అదే ఏరియాలో ఏ1, ఏ2 మగ పులులు జిల్లా పరిధిలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది..కాగా పెద్దపులి జీవిత కాలం 10 నుండి 15 సంవత్సరాలు, వాటి పాదముద్రలు అవి నడుస్తున్నప్పుడు 9 నుండి 10 సెంటీ మీటర్ల విస్తీర్ణంతో ఉంటుంది. స్థిరంగా నిలుచుని ఉన్నప్పుడు వాటి పాద ముద్రలు 14, 15 సెంటీ మీటర్లు ఉండటానికి అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

చిట్యాల ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు కోసం ఆదివారం మున్సిపల్ చైర్మెన్ రాజూరా సత్యం రజక సంఘం సభ్యులతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో ఉన్నటువంటి డివైడర్ మధ్య స్థలంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పాలకవర్గం తరఫున డివైడర్ మధ్యలో స్థలమును కేటాయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కుర్మా శ్రీనివాస్, రజక సంఘం నిర్మల్ జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు సట్ల శంకర్, జిల్లా గౌరవాధ్యక్షులు సట్ల నర్సయ్య, సంఘం సభ్యులు సిరిగాపు లింగన్న, ఆగుట్ల రాజన్న, సట్ల రాజేందర్, మలికిరి రాజశేఖర్, అగుట్ల చంటి, సిరిగారపు రాజు, అగుట్లా శ్యామ్, నిమ్మల సాయి పాల్గొన్నారు.

గిరిజనేతర వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంతో పాటు మండలంలోని తాడిహత్నూర్ తదితర గ్రామాల్లో ట్రేడ్‌లైసెన్స్ లేకుండా పత్తి కొనుగోళ్లు చేస్తున్న గిరిజనేతరుల వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి అర్కా గోవింద్‌రావ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో ఏజెన్సీ చట్టాలు 1/70 యాక్ట్, పేసా, 5వ షెడ్యూల్డ్ చట్టాలకు విరుద్ధంగా ట్రేడ్ లైసెన్స్ లేకుండా అక్రమంగా నాన్ ట్రైబల్ వ్యాపారస్థులు పత్తి కొనుగోళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యాపారం కంప్యూటర్ కాంటాతో ఆదివాసీ గిరిజన అమాయక రైతులను మోసం చేస్తున్న చట్టానికి విరుద్ధంగా జరుగుతున్న వ్యాపారంపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకుంటలేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సు లేకుండా కొనుగోళ్లు చేస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేయాలని కోరారు.

లగచర్ల గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి



నవతెలంగాణ-నార్నూర్

రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో లగచర్ల లంబాడి గిరిజనులపై దాడులు చేసి, అక్రమంగా అరెస్టు చేసి పెట్టిన కేసులని ఎత్తివేయాలని పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ అడే అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద దాడి చేయడాన్ని ఖండించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలోని లగిచర్ల గిరిజనుల భూములను ఫార్మా కంపెనీ పేరుతో లాక్కోవాలని చూస్తున్నారన్నారు. తన అల్లుడి కోసం అమాయక గిరిజనులను వేధిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రిపై కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. అమాయక గిరిజనులపై బనాయించిన అక్రమ కేసులను వెంటనే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత అల్లుడి ఫార్మ కంపెనీ కోసం కొడంగల్ నియోజకవర్గంలో వందల ఎకరాలు భూములు ఉన్న రెడ్డి, రావులకు సంబంధించిన భూములను లాక్కొని ఏర్పాటు చేసుకోవాలన్నారు. గిరిజనుల పేరుతో ఉన్న రెండు మూడు ఎకరాల భూములను ప్రభుత్వం లాక్కోవాలని చూస్తే వాళ్ళ ఎలా ఊకుంటారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇలాంటి చీప్ ట్రిక్కులు చేస్తూ అమాయక ప్రజలను వేధిస్తున్నారనీ ఆరోపించారు. లంబాడి గిరిజన జోలికొస్తే ఖబర్దార్ అని బాధితులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేష్, నాయకులు శివాజీ, రాథోడ్ అశోక్, ఆడే మహేందర్ ఉన్నారు.

మంత్రిని కలిసిన పద్మశాలి సంఘం అధ్యక్షుడు



నవతెలంగాణ-బోథ్

రోడ్డు రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం హైదారాబాద్ తన నివాసంలో బోథ్ పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు మెరుగు భోజన్నా మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి పలు సమస్యలను విన్నవించారు. బీసీ స్కాలర్షిప్‌తో పాటు బోథ్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి త్వరలోనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని మాట ఇచ్చి తప్పడంతో ఉద్యోగ నియామకాల్లో మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతోందని అన్నారు.ఆదివారం పట్టణంలోని బీసీ సంఘ భవనంలో మాదిగ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య మాదిగ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మాదిగ ఉపకులాల ఉద్యోగుల సదస్సులో రాష్ట్ర అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరి మాట్లాడుతూ సుదీర్ఘంగా 30 సంవత్సరాలలో ఎన్నో పోరాటాలు త్యాగాలు ద్వారా సాధించుకున్న ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇకనైనా వర్గీకరణ అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేసి వర్గీకరణ అమలు చేసుకునేంతవరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సదస్సులో మాదిగ ఉద్యోగుల రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పరిపల్లి నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు కొల్లూరు శంకర్, తరుడి వసంత్, సాంబశివరావు, సీనియర్ నాయకులు, సందూరి వినయ్ సాగర్, గుర్రాల ఆశన్న, కొప్పర్తి రాజన్న, కూడాల నర్సయ్య, అగ్గిమల్ల భూమన్న ఆరెపల్లి గణేష్, చందాల వెంకటేష్, సొన్న సుధాకర్, దుమాల శివ, రాజు, జిల్లాపెల్లి రమేష్, శ్రీకర్, మనోజ్ పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న హమాలీలందరికీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించిందని గుర్తు చేశారు. వెంటనే అసంఘటిత రంగంలో ఎగుమతి, దిగుమతి పనులు నిర్వహిస్తున్న బజారు హమాలీ, ప్రయివేట్ గోదామ్ హమాలీ, కూరగాయల మార్కెట్, ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పనిచేస్తున్న హమాలీలందరికీ కనీస పెన్షన్ రూ.10వేలు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన వ్యవసాయ మార్కెట్ యార్డు, ఎఫ్సీఐ, సివిల్ సప్లై, టీజీ బీసీఎల్, ఎలక్ట్రిసిటీ స్టోర్‌లలో పనిచేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అర్హులైన ఇల్లు లేని హమాలీలకు ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

'రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు'

● మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

● యాసంగికి సాగునీరు అందిస్తాం..రైతులు సమాయత్తం కావాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, యాసంగికి సాగునీరు అందిస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. ఆదివారం లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని అమ్మి సన్నాలకు బోనస్ రూ.ఐదు వందలు పొందాలన్నారు. ఈ యాసంగి పంటకు సాగునీరు అందిస్తామని రైతులు సాగుకు సమాయత్తం కావాలన్నారు. నియోజకవర్గంలో త్వరలో మోదెల, ద్వారక, గుడిరేవు, హాజీపూర్‌లలో లిఫ్టలకు భూమి పూజలు చేస్తామన్నారు. అభివృద్ధికి అడ్డొచ్చే ఎవరైన వదిలిపెట్టేది లేదని వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. అభివృద్ధి సంక్షేమం విషయంలో వెనక్కి తగ్గేదిలేదని, విద్యా, వైద్యంపై ముందు చూపుతో విజన్‌తో ముందుకెవెళ్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పూర్ణ చందర్‌రావు, గడ్డం త్రిమూర్తి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మండల అధ్యక్షులు పింగిలి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చంద్, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ, మండలనాయకులు పాల్గొన్నారు.

బెబ్బులి అలజడితో మండలంలో భయం.. భయం..



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మహారాష్ట్ర తిప్పేశ్వర్ అటవీ ప్రాంతం నుంచి ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో ప్రవేశించిన చిరుత పులి శనివారం ఉట్నూర్ మండలంలోని రాజుల్‌గూడ, వంకతుమ్మ గ్రామం జంగు అనే రైతు ఎద్దులపై దాడి చేయడంతో ఇరు మండలాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ బెబ్బులి ఇంద్రవెల్లితో పాటు ఉట్నూర్ మండలం సరిహద్దున సంచరిస్తోంది. ఇంద్రవెల్లి అటవీ రేంజ్ ప్రాంతం వాయిపేట్ వరకు విస్తరించి ఉంది. వంకతుమ్మలో పులి ఎద్దుపై దాడి చేయడంతో పక్కనే ఇంద్రవెల్లి అటవీ ప్రాంతం ఉంది. ఈ పులి ముందు వెళితే జైనూర్, ఆసిఫాబాద్, నార్నూర్ మండలంలో ప్రవేశిస్తుందా లేదా పక్కనే అటవీ ప్రాంతం దట్టంగా ఉన్న ఇంద్రవెల్లి, సిరికొండ మండలంలోని వాయిపేట ప్రాంతంలో ప్రవేశించే అవకాశం మెండుగా ఆగుపిస్తోంది. ఈ విషయంపై స్థానిక రేంజ్ అధికారి సంతోష్ కుమార్‌ను నవతెలంగాణ సంప్రదించగా ఫోన్‌ను ఎత్త లేదు.

కళాకారుడికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఉట్నూర్



బంజారా కళాకారుడు షాహిర్ దౌలత్ రాథోడ్ ఆరోగ్య, ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న బంజారా రచయితల వేదిక ఆదిలాబాద్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం మహారాష్ట్రలోని నిరాలా తాండకు వెళ్లి తమ వంతుగా రూ.పదకొండు వేల ఆర్థిక సాయాన్ని అందజేయడంతో పాటు బంజారా రచయిత వేదిక ఆధ్వర్యంలో దౌలత్‌కి గాన గంధర్వ అవార్డును ప్రధానం చేశారు. అదే విధంగా ఆర్థిక సాయానికి స్పందించిన రిటైర్డ్ ఉద్యోగి రాథోడ్ భీమ్‌రావ్ నాయక్, బంకట్ లాల్ జాదవ్, మురళీ జాదవ్, పరమేశ్వర్ చౌహాన్, ఉపాధ్యాయ నాయకుడు ఆత్మారాం బానోత్, ధరంసింగ్, సంజయ్‌కు వేదిక నాయకులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వేదిక గౌరవ అధ్యక్షులు బంకట్ లాల్ జాదవ్, అధ్యక్షులు డాక్టర్ ఇందల్ సింగ్, సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | నవంబర్ 18, 2024 | www.navatelangana.com

బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మావల మండలంలోని కుమురంభీం కాలనీకి చెందిన తుడుందెబ్బ సీనియర్ నాయకుడు ఉయిక సంజీవ్ కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంటు ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ పరామర్శించారు. ఆదిలాబాద్ పట్టణంలోని కుమురంభీం కాలనీలోని ఆయన నివాసానికి ఆదివారం భర్త భుజంగారావుతో కలిసి వెళ్లి



ఉయిక సంజీవ్‌ను పరామర్శించి, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. పరామర్శించిన వారిలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు సునీల్ జాదవ్, సుభాష్ షిండే ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణం, సోన్, దిలావర్‌పూర్, నర్సాపూర్ లక్ష్మణచాంద, మామడ మండలాలకు చెందిన 187 మంది లబ్ధిదారులకు రూ. 40 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆదివారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తొలిరోజు ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష

- ఉదయం పరీక్షకు 3,643 మంది గైర్హాజరు
- మధ్యాహ్నం పరీక్షకు 3,674 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు
- పరీక్షకు దూరమైన పలువురు విద్యార్థులు



బోర్డుపై హాల్‌టికెట్ నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-3 పరీక్షా జిల్లాలో తొలిరోజు ప్రశాంత వాతావరణంలో జరిగింది. గ్రూప్-3 కోసం సంసిద్ధమవుతున్న అభ్యర్థులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పరీక్షకు సంబంధిత అధికార యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేశారు. అభ్యర్థులకు జిల్లా వ్యాప్తంగా 29 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులను కల్పించేలా తగు చర్యలు తీసుకున్నారు. టీజీపీఎస్సీ ద్వార జరుగుతున్న పరీక్ష నిర్వహణపై జిల్లా కలెక్టర్ రాజర్షిషా గత కొన్ని రోజులుగా ప్రత్యేక దృష్టి సారించారు. అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, దిశా నిర్దేశం చేశారు. అటు జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం సైతం భద్రత పరంగా చర్యలు సమావేశాలు నిర్వహించారు.

పరీక్షకు భారీగా గైర్హాజరైన విద్యార్థులు...

ఆదివారం మొదటి పేపర్ ఉదయం 10 గంటల నుంచి 12.30 నిమిషాల వరకు రెండో పేపర్ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 నిమిషాల వరకు కొనసాగింది. ఉదయం జరిగిన పేపర్-1 పరీక్షకు మొత్తం 10,255 మంది విద్యార్థుకు గానూ, 6,612 మంది విద్యార్థులు హాజరు కాగా, 3,643 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు 6,581 మంది హాజరు కాగా 3,674 మంది గైర్హాజరయ్యారు. అర్ధగంట ముందే గేట్లు మూసివేస్తామన్న నిబంధన అమల్లో ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. కొందరు చివరి నిమిషాన ఉరుకులు పరుగుల తీశారు.

భద్రత నడుమ జరిగిన పరీక్ష...

ఉదయం 8.30 నిమిషాల నుంచి అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. ఎలాంటి పరికరాలను, వస్తువులను లోపలికి అనుమతించలేదు. కాగా పరీక్ష కేంద్రాల వద్ద ఎక్కడ ఎటువంటి అవాంచనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రాల వద్ద భారీకేడ్లు ఏర్పాటు చేసి, 144 సెక్షన్ విధించారు. కేంద్రాల్లో పాటించాల్సిన నియమ నిబంధనలపై అభ్యర్థులకు హాల్ టికెట్లపై స్పష్టమైన సూచనలు జారీ చేశారు. అలాగే 163 బీఎస్ఎన్ఎస్ సెక్షన్ అమలులో ఉన్నందున జిరాక్స్ షాపులు మూసిఉంచారు.

పరీక్ష కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ...

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షిషాతో పాటు ఎస్పీ గౌస్‌ఆలం పలు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఎప్పటికపుడు పరిస్థితులను పర్యవేక్షిస్తూ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ప్రతి పరీక్ష గదిని సందర్శిస్తూ సిబ్బంది, అభ్యర్థులతో మాట్లాడారు. అలాగే కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సూచించారు.

పరీక్షకు దూరమైన 15 మందికి పైగా విద్యార్థులు...

జిల్లాలో జరిగిన గ్రూప్-3 పరీక్షకు 15 మందికి పైగా దూరమయ్యారు. ఉదయం 9.30 నిమిషాలకు గేట్లు మూతపడిన అనంతరం పలువురు లోకల్, నాన్ లోకల్ విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. దీంతో లోపలికి పంపమని వేడుకున్నప్పటికి అధికారులు నిరాకరించారు. పట్టణంలోని నలంద కళాశాల పరీక్ష కేంద్రానికి ఎనిమిది మంది విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. ఆ సమయానికే కలెక్టర్ రావడంతో విద్యార్థులు లోపలికి పంపించమని వేడుకున్నారు. రూల్స్ ప్రకారం పంపడం కుదరదని కలెక్టర్ చెప్పారు. దీంతో విద్యార్థులు చేసేదేమీ లేక నిరాశతో కన్నీరు పెట్టుకొని వెనుదిరిగారు. అలాగే ఇతర పరీక్ష కేంద్రాల నుంచి పలువురు ఆలస్యంగా చేరుకున్నారు. కొందరు విద్యార్థులు పొంతన లేని కారణాలు చెప్పారు. ఆలస్యంగా రావడంలో కొందరు లోకల్ విద్యార్థులే ఉండటం గమనార్హం.



పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్‌ఆలం





'దళితుల్లో చిచ్చు పెట్టడం తగదు'



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

వర్గీకరణ పేరుతో దళితుల్లో చిచ్చు రగిల్చి లబ్ధి పొందాలనుకోవడం మంచిది కాదని మాల మహానాడు సీనియర్ నాయకులు ద్యావతి రాజేశ్వర్, రాచమల్ల రాజశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో మాలమహానాడు అధ్వర్యంలో జెండా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల జనభా ప్రాతిపదికన ప్రభుత్వం రజర్వేషన్లు అమలు చేయాని అన్నారు. కులాల వారిగా విభజన చేసి మాలలకు అన్యాయం చేస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. హక్కుల సాధనకోసం మాలలు ఐక్యంగా ఉండి పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం నాయకులు నేత శ్యామ్, పండుగ పెద్దులు, అశోక్, మేస సతేష్, మ్యాదరి రాజేశ్వర్, ద్యావతి గంగాధర్ పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇంటింటా సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ జవహర్‌లాల్ కోరారు. ఆదివారం జామడ గ్రామపంచాయతీలో కొనసాగుతున్న సర్వే తీరును పరిశీలించారు. తప్పులు లేకుండా అన్ని అంశాలను పొందు పర్చాలని ఎన్యూమరెటర్లకు సూచించారు. అదేవిధంగా నూతన పంచాయతీ భవనం పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, పీఆర్ ఏఈని ఆదేశించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మడావి ముక్తా రూపదేవ్, పంచాయతీ కార్యదర్శి మెస్రం నెహ్రూ ఉన్నారు.

కాంగ్రెస్ కూటమి మోసాలను నమ్మొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ కూటమి మోసాలను నమ్మొద్దని మహారాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వర్ధ ఎమ్మెల్యే అభ్యర్థి పంకజ్ బోయర్‌కు మద్ధతుగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో మాజీ కేంద్రమంత్రి స్మృతి ఇరానీతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దని అక్కడి ప్రజలను కోరారు. తెలంగాణలో ఇచ్చిన వాగ్దానాలను ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ నెరవేర్చడం లేదని అన్నారు. బీజేపీ కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వానికి మద్దతు తెలిపాలని అన్నారు. బీజేపీ సర్కార్ మహారాష్ట్రలో రావడం ఖాయమని స్పష్టం చేశారు.

రాష్ట్ర సాంస్కృతికశాఖ చైర్మెన్ నియామకంపై హర్షం

నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ చైర్మెన్‌గా స్వర్గీయ గద్దర్ కుమార్తె గుమ్మడి వెన్నెలను నియమించడం పట్ల కాంగ్రెస్ ఎస్టీ సెల్ నిర్మల్ జిల్లా చైర్మెన్ బాణావత్ గోవింద్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు. గద్దర్ కుమార్తెకు సముచిత స్థానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందని. అందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉట్నూర్

మహారాష్ట్ర రాష్ట్రంలోని చంద్రపూర్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ కేసీ వేణుగోపాల్‌ని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శనివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారితో ఏఐసీసీ కార్యదర్శి ఆలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఉన్నారు.

తరుగులేకుండా ధాన్యాన్ని దిగుమతి చేసుకుంటాం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం ఉన్న ధాన్యాన్ని ఎటువంటి తరుగు లేకుండా దిగుమతి చేసుకుంటామని నిర్మల్ జిల్లా బాయిల్డ్ రైస్ అసోసియేషన్ అధ్యక్షులు సాదుల కృష్ణదాస్ తెలిపారు. ఈ సందర్భంగా వారు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసి పంపాలని నిబంధనల ప్రకారం ధాన్యం మిల్లులకు వచ్చిన వెంటనే దిగుమతి చేసుకుంటామని తెలిపారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి



నవతెలంగాణ-బోథ్

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో పాటు గ్యారంటీలను అమలు చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేష్ మహారాజ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని మెజారిటీ ప్రజలైన 90శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్యా, వైద్యం అందించాలన్నారు. అర్హులైన వారికి భూమి, ఇల్లు, ఉపాధిని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజలందరికీ ప్రభుత్వం భారత రాజ్యాంగం ద్వారా అందించాల్సిన భూమిలేని వారికి ఐదు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఐదు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజాధనాన్ని వివిధ అనవసరమైన పథకాలకు దుర్వినియోగం చేస్తుందని విమర్శించారు. హామీలను అమలు చేయని పక్షాన దశలవారీగా రాష్ట్రంలో జిల్లాలో ధర్నాలు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రాబోయే రోజులలో అగ్రకులాల ప్రభుత్వాన్ని కూల్చుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటి సభ్యులు వెంకటేష్, బోథ్ మండల డీఎస్పీ అధ్యక్షులు గణేష్, ఉపాధ్యక్షులు పెందూరు జల్దేవ్, నాయకులు నామోడే గజానంద్, కలిగేటి ప్రవీణ్, కుందూరు సుధాకర్, బీక్క రమేష్, రాథోడ్ నరేందర్, బీక్క రాకేష్, జూకంటి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

పులి పాదముద్రలను పరిశీలించిన అటవీ అధికారులు



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని పలు గ్రామాల శివారులో పెద్దపులి సంచరిస్తున్న విషయం తెలిసిందే. కాగా ఆదివారం మండలంలోని చీమ నాయక్ తండ గ్రామ శివారులో ఉన్న కాలువ వద్ద పెద్దపులి పాదముద్రలను స్థానికులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు ఘటన స్థలాన్ని చేరుకొని పాద ముద్రలను పరిశీలించి పెద్ద పులి ఈ ప్రాంతంలో ఉందని అన్నారు. మూడు రోజుల పాటు ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పశువుల కాపరులు అడవికి, రైతులు పొలాల వద్దకు వెల్లవద్దన్నారు. పులి ఎక్కడైనా కనబడితే అటవీ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

లంబాడీలపై కాంగ్రెస్ ప్రభుత్వం దౌర్జన్యాన్ని మానుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని, రుద్రాల మండలం లంబాడి తండాలైన లగిచర్ల గ్రామ గిరిజన లంబాడ రైతులను వేధించడం, అరెస్టు చేయడం, జైలుకు తరలించడం, మహిళలపై దౌర్జన్యం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ జగన్, మాజీ జెడ్పీ చైర్మెన్ జనార్దన్ రాథోడ్, ఎల్‌హెచ్‌పీహెచ్ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు చవాన్ భారత్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని ఉద్యేశించి జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్ మాట్లాడుతూ లంబాడీ గిరిజనులను వేధించడం మానుకోవాలని, ఫార్మాసిటీ ఏర్పాట్లు రద్దు చేసుకోవాలని, గిరిజన లంబాడి భూములను తీసుకునే ఆలోచన విరమించుకోవాలని, జైల్లో పెట్టినటువంటి గిరిజనులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ నాపైన దాడి జరగలేదని పేర్కొన్న ప్రభుత్వం గిరిజన రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం మానుకోవాలని, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు భారత్ చవాన్ పేర్కొన్నారు. గిరిజనులను వేధింపులు చేసే చర్యలను మానుకోవాలని, జైల్లో పెట్టిన వారిని వెంటనే బేషరత్తుగా విడుదల చేయాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు దశల వారిగా చేపడతామని ఆయన అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కి మెమోరాండం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నల్ల బ్యాడ్జీల నిరసన కార్యక్రమంలో లంబాడి జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ రామారావు, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర నాయకులు రాథోడ్ నారాయణ, గుగ్లావత్ శ్రీరామ్ నాయక్, నేతావత్ రాందాస్ నాయక్, టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేష్, జిల్లా అధ్యక్షులు జాదవ్ రవి, దినేష్, జాదవ్ మధుకర్, పవార్ గంగారాం నాయక్, ఆడే దిగంబర్ భజనకరి, జె.నారాయణ, జి.అజయ్, జి.నాను, ఆర్.రవీందర్, నూర్ సింగ్, ప్రకాష్, దత్తారాం, లాల్ సింగ్, జాదవ్ వసంత్‌రావు, జాదవ్ శ్రీకాంత్, ఆర్.నగేష్, జి.నాను, సీహెచ్ సంతోష్, ఎ.రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే మహారాష్ట్ర అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ పార్టీతోనే మహారాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం యవత్‌మాల్ జిల్లా ఆర్ని నియోజవర్గంలో ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి జరగాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ చెప్పేదే చేస్తుందని, చేసేదే చెప్తుందని అన్నారు. మాజీ మంత్రి జితేందర్ శివాజీరావ్ మోగేకు హస్తం గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి ఉంటుందని అన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలో వస్తే ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.3వేలు, రూ.3లక్షల రుణమాఫీ చేస్తామని, యువకులకు రూ.4వేలు, కులగణన చేసి రిజర్వేషన్‌లను పెంచుతామని అన్నారు. రూ.25లక్షల ఆరోగ్య భీమా ఇస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 6 గ్యారంటీలను పక్కగా ప్రజలకు అందేలా చర్యలు చేపడుతుందన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలో వస్తే ఇచ్చిన మాట ప్రకారం ప్రతి హామీని పక్కగా అమలు చేస్తుందన్నారు. బీజేపీ దేశంలో కుల మతాల మధ్య చిచ్చు పెడుతుందని అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు పన్నుతుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని రక్షించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జితేందర్ శివాజీరావ్ మోగే, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భూవివాదంలో కొడుకుపై తండ్రి కత్తితో దాడి

నవతెలంగాణ-నార్నూర్

భూ వివాదంలో కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసిన ఘటన శనివారం రాత్రి మండలంలోని గుంజాల గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం సీఐ రహీమ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుంజాల గ్రామానికి చెందిన రైతు భుజంగ్‌రావ్ తన కొడుకు బాలాజీ భూమి వాటా కావాలని అడిగినందుకు భూ వివాదంతో శనివారం రాత్రి తాగిన మైకంలో క్షణికావేశంతో కొడుకు కడుపులో కత్తితో పొడిచాడు. పేగులో రక్తస్రావం అయి జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు భుజంగ్‌రావ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన చాప్లె ప్రకాష్ ఇల్లు ఈ నెల 15న విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న మాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్నులే మారుతీ ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చొరవ తీసుకొని త్వరగా ఆర్థిక సాయం అందించే విధంగా చూడాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి సంఘటన ఎలా జరిగిందో వివరించగా వెంటనే ఆమె స్పందించి ప్రభుత్వం నుండి వచ్చే గృహజ్యోతి పథకంలో ఇల్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

చుక్కల దుప్పిని కాపాడిన అటవీశాఖ సిబ్బంది

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని చెడ్వాయి నర్సరీ ప్రాంతంలో గాయపడి రోడ్డు మీద ఉన్న చుక్కల దుప్పిన గమనించిన ఎస్ఐ కొముర‌య్య అటవీశాఖ రేంజ్ అధికారి అనిల్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన ఇచ్చిన సమాచారం మేరకు గాయపడిన చుక్కల దుప్పిన పెంచికల్‌పేట్ డిప్యూటీ రేంజ్ అధికారి జమీల్ హమ్మద్, అబ్దుల్ ముసవీర్ దుప్పిని రక్షించి పశు వైద్యాధికారితో వైద్యం చేయించారు. అనంతరం అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. కార్యక్రమంలో బీట్ అధికారి మనోహర్, వాచర్ల రాజు, రామయ్య, సంతోష్, పెంటయ్య పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోక ఆరోపణలు సరికాదు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

అధికారులు తమ పనితీరు మార్చుకోక అనవసరమైన ఆరోపణలు చేయడం సరికాదని ప్రజాసంఘాల నాయకులు సూచించారు. వాంకిడి మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో జరిగిన కలుషిత ఆహారం అంశంపై సస్పెన్షన్‌కు గురైన అధికారికి అండగా నిలుస్తూ కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడంతో పాటు ప్రజా సంఘాలపై చేసిన ఆరోపణలను ఆదివారం పత్రిక విలేకరుల సమావేశంలో ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలుషిత ఆహారంతో విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంపై మాత్రమే తాము ప్రశ్నించామని ఏ అధికారి సస్పెండ్ కావాలని తాము కోరుకోవడం లేదన్నారు. సంఘటన పక్కదారి పట్టించేలా ప్రస్తుతం అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థినులకు అండగా ఉండాల్సింది పోగా హాస్టల్ నిర్వహణ టెండర్ల ద్వారా చేపట్టాలని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. టెండర్ల ద్వారా చేస్తే ప్రయివేట్ వ్యక్తులకు బాధ్యత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు అండగా ఉండాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాలపై అనవసరమైన ఆరోపణలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాప్లే సాయికృష్ణ, నాయకుడు రమేశ్ పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలో ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ అల్బర్ట్ అన్నారు. ఆదివారం మండలంలోని బొంబాయిగూడ, మొట్లగూడ, గొంట్లపేట, చెడ్వాయి, ఎల్లూరు గ్రామపంచాయతీల్లో పర్యటించి సర్వే తీరును పరిశీలించారు. ప్రతి ఒక్క కుటుంబాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. కుటుంబంలో ఎవరైనా ఒక్కరు కుటుంబ సభ్యుల వివరాలన్ని దగ్గర ఉంచుకొని సర్వేకు సహకరించాలని గ్రామస్తులకు సూచించారు. ఎల్కపల్లిలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు.

నేడు గ్రూప్-3 పరీక్ష కేంద్రాల విద్యా సంస్థలకు సెలవు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో నేడు గ్రూప్-3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసిన విద్య సంస్థలకు సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆది, సోమవారాల్లో జిల్లాలో జరుగుతున్న గ్రూప్-3 పరీక్షలలో భాగంగా ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్-3 పరీక్ష జరుగనున్నందున పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిన విద్యాసంస్థలకు సెలవు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

వసుధా శతక పుస్తకావిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు, ప్రముఖ పద్యకవి ధర్మపురి వెంకటేశ్వర్లు రచించిన వసుధా శతక పుస్తకాన్ని జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అతిథులు, కవులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మర్యాల ఉదయబాబు మాట్లాడుతూ కవులు సామాజిక స్పృహ కలిగిన రచనలు చేయాలని అన్నారు. రచయిత వెంకటేశ్వర్లును అభినందించారు. మంచి రచనలు చేసే కవులు పాఠకుల మదిలో చిరస్థాయిగా ఉంటారన్నారు. విటిని వినియోగించుకుంటు ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో కవులు ఆకసం కవులు నల్గొండ రమేష్, శ్రీరామ్ సత్యనారాయణ, మాడుగుల నారాయణమూర్తి, పుస్తక రచయిత ధర్మపురి వేంకటేశ్వర్లు, దేవరాజు రేవతి, గుర్రాల వెంకటేశ్వర్లు, చిలుకూరి రాధాకృష్ణ చారి, మాడిశెట్టి శ్రీనివాస్ రాజయ్య, ఇషాక్, సాయిని శ్రీదేవి, కాచం సవిత పెంటయ్య, శ్రీలత, చరణ్ సాకేత్, సాయి, వివేక్, అమర్ బిన్ హైమద్ కాంట్రాక్టర్, గ్రంథాలయ సిబ్బంది, లైబ్రేరియన్స్ టి.సదానందం, ప్రవీణ, స్వర్ణలత, సతీదేవి, వెంకటరమణ. స్వీపర్ సలీం, రామయ్య, గోపి పాల్గొన్నారు.

ప్రశాంతంగా మొదటి రోజు గ్రూప్-3 పరీక్షలు

• కేంద్రాలు సందర్శించిన కలెక్టర్ • ఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు



ఆసిఫాబాద్ : పరీక్ష కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లావ్యాప్తంగా టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-3 పరీక్ష మొదటిరోజు ప్రశాంతంగా ముగిసింది. ఉదయం మొదటి పేపర్, మధ్యాహ్నం రెండో పేపర్ నిర్వహించారు. జిల్లాలో మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 18 సెంటర్లు ఏర్పాటు చేయక మొదటి రోజు మొదటి పేపర్ 4471 మందికి గాను 2794 మంది హాజరు కాగా 1677 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండవ పేపర్‌కు 4471 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 2779 హాజరు కాగా 1692 మంది గైర్హాజరైనట్లు పరీక్షల కన్వీనర్ లక్ష్మీనరసింహ తెలిపారు.

పలు కేంద్రాలు సందర్శించిన కలెక్టర్

గ్రూప్ 3 పరీక్ష నిర్వహణ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా యంత్రాంగం కలెక్టర్ వెంకటేష్ ధోత్రే పరీక్ష నిర్వహణ తీరును జిల్లాలోని పలు సెంటర్లు తిరిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌తో పాటు పీటీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు.

బందోబస్తులో నిమగ్నమైన ఎస్పీ

ఎస్పీ డీవీ శ్రీవారావు గ్రూప్ 3 పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 18 సెంటర్లలో ఎటువంటి లోటుపాట్లు అవకతవకలు జరగకుండా అధికారులతో సమీక్షలు నిర్వహించినప్పటికీ బందోబస్తును దగ్గర ఉండి పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్లను పరిశీలించారు. అభ్యర్థులను పూర్తిగా తనిఖీ చేసి లోపలికి పంపించాలని ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించకూడదని తెలిపారు. బందోబస్తులో తేడా వస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంతంగా గ్రూప్ 3 పరీక్ష

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన గ్రూప్ 3 పరీక్షలు ప్రశాంతంగా సాగాయి. పట్టణంలో తొమ్మిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయం పేపర్ 1, మధ్యాహ్నం పేపర్ 2 పరీక్ష నిర్వహించారు. నిమిషం నిబంధన నేపథ్యంలో నలుగురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు అనుమతించలేదు. దీంతో అభ్యర్థులు నిరాశగా వెనుదిరిగారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించలేదు. పట్టణంలోని సెయింట్మారెట్, వివేకానంద డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాలు పర్యవేక్షించారు. కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి అభ్యర్థులను పరీక్ష కేంద్రాలకు తరలించారు. వికలాంగుడైన జాకిర్ పాషా తనకు రెండు చేతులు లేకున్నప్పటికీ గ్రూప్ 3 పరీక్ష రాసి ఆదర్శంగా నిలిచాడు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా సాగింది.



ఆసిఫాబాద్ : బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్



కాగజ్‌నగర్ : పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్, సబ్ కలెక్టర్

డిసెంబర్ 3న చలో ఢిల్లీ జయప్రదం చేయాలి

నవతెలంగాణ-బెజ్జూర్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై డిసెంబర్ 3న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. మండలంలోని రైతు వేదిక ఆవరణలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల కమిటి సమావేశాన్ని ఆదివారం యూనియన్ మండల కమిటీ నాయకురాలు సునీత అధ్యక్షన నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై జరుగుతున్న డిశెంబర్ 3న చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. యూనియన్ జిల్లా, మండల కమిటీల సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఢిల్లీకి వెళ్లెందుకు సన్నద్ధం కావాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 45వ కార్మిక సదస్సు నిర్ణయం ప్రకారం మధ్యాహ్న భోజన కార్మికులను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ.26,000లు ఇవ్వాలనీ, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలనీ, మెనూ చార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.20 ఇవ్వాలనీ, జాతీయ నూతన విద్యా విధానం-2020ని రద్దు చేయాలన్నారు. కార్మికుల ఉద్యోగాల నుండి తొలగించకూడదని, తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. వయస్సు పైబడి రిటైర్ అవుతున్న కార్మికులందరికీ రూ.3 లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలనీ, 12వ తరగతి వరకు ఉన్న పిల్లలందరినీ మధ్యాహ్న భోజన పథకం క్రింద కవర్ చేయాలనీ, మధ్యాహ్న భోజన పథకంలో కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు, కేంద్రీకృత వంటశాలను రద్దు చేయడంతో పాటు పథకం ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధనకు చలో ఢిల్లీనీ రాష్ట్రంలో ఉన్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు భాయక్క, సువర్ణ, ఉపాధ్యక్షులు విజయ, శాంత, యూనియన్ మండల నాయకులు పద్మా, గంగుబాయి, లక్ష్మీ, సువర్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి

కమాన గ్రామంలో సంవిధాన్ దివస్ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని కమాన గ్రామంలో నాగ్‌సేన్ బుద్ధ విహార్‌లో గల బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద సమతా భారత్ ఐక్యవేదిక నాయకులు సంవిధాన్ దివస్ పోస్టర్లను సమాజ్ అధ్యక్షుడు జాడి శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న లుంబిని దీక్ష భూమిలో భారత రాజ్యాంగ దివస్(సంవిధాన్ దివస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 15 మండలాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, వివిధ కుల సంఘాలకు సంబంధించిన నాయకులు, కమాన గ్రామ బౌద్ధ సమాజ్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, ఖమ్మం జిల్లా సీనియర్ డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్ ముఖ్య అతిథులుగా రానున్నట్టు తెలిపారు. రాజ్యాంగంపై పూర్తి అవగాహన కల్పించనున్నట్టు సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన సమత భారతి సంస్థ ప్రతినిధులు సిరికల్చర్ రిటైర్డ్ అధికారి అన్నారావు జాడే, బేగంపేట్ ఏరోనాటికల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జాడే ఆనంద్‌రావు, మారుతి, శంకర్, పాండురంగ భీంరావు, జయంత్‌రావు, వినేష్, అనిల్, చేతన్ శర్మ సందీప్, మహేందర్, టెమాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాలు తరలింపులో అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో జరుగుతున్న గ్రూప్ 3 పరీక్షలకు సంబంధించి ప్రశ్న పత్రాలను భద్రత గదికి తరలించడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించి పరిస్థితులు అడిగి తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న గ్రూప్-3 పరీక్షల నిర్వహణకు స్ట్రాంగ్ రూమ్ నుండి పరీక్ష పత్రాలను పటిష్ట భద్రత మధ్య తరలించాలని ఆదేశించారు. రూట్ అధికారులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు పరీక్ష పత్రాలు, ఓఎంఆర్ షీట్లను పటిష్ట భద్రత మధ్య నిర్ణీత సమయంలో తరలించి ఆయా పరీక్ష కేంద్రాల ముఖ్య పర్యవేక్షకులకు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో కేటాయించిన కేంద్రాలకు కోడ్ ప్రకారం పత్రాలను అందజేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎదైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పరీక్షల ప్రాంతీయ సమన్వయకర్త లక్ష్మీనరసింహ, రూట్ అధికారులు, ముఖ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయంలో కవి సమ్మేళనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలల్లో నాల్గవ రోజు ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా జిల్లా పరీక్షల సహాయ సంచాలకుడు ఉదయబాబు హాజరయ్యారు. కవులు నల్గొండ రమేష్, మాడుగుల నారాయణమూర్తి, మాడుగుల సరస్వతి, మంచికట్ల రాజయ్య, శ్రీరామ్ సత్యనారాయణ, గుర్రాల వెంకటేశ్వర్లు, ధర్మపురి వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ చారి, మాడిశెట్టి శ్రీనివాస్, ఇషాక్, సాయిని శ్రీదేవి, రేవతి, కాచం సవిత జాడి పెంటయ్య, ధరణి శ్రీలత, కల్లూరి చరణ్ సాకేత్, రాథోడ్ సాయి, వివేక్ పాల్గొని కవితలు చదివి వినిపించారు. అనంతరం కవులకు శాలువలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉదయ బాబు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలలో పాఠకులు విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయడంతో గ్రంథాలయ అవసరం తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, అధికారులు సదానందం, ప్రవీణ, స్వర్ణలత, సతీదేవి, వెంకటరమణ, స్వీపర్ సలీం, రామయ్య, గోపి, పాఠకులు పాల్గొన్నారు.

సేవాలాల్ సేన నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-కెరమెరి

కొడంగల్ నియోజకవర్గంలో లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీల భూసేకరణలో జరిగిన సంఘటన కారణంగా అక్కడి లంబాడి గిరిజనులను అక్రమ అరెస్టులను వారిపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని సోమవారం సేవాలాల్ సేన చలో గాంధీ భవన్ ముట్టడిని పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో సేవాలాల్ సేన నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సేవ లాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్ మాట్లాడుతూ లగచర్ల గ్రామంలోని లంబాడి గిరిజనులపైన అక్రమ కేసులు పెట్టి చిత్రహింసలు గురి చేయడం సరైంది కాదన్నారు. గిరిజనులపై పెట్టిన కేసులను వెంటనే ప్రభుత్వం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరన్నారు. అరెస్ట్ అయిన వారిలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ రవి నాయక్, మండల అధ్యక్షుడు రాథోడ్ రమేష్, మండల ఉపాధ్యక్షుడు ధరావత్ ధనరాజ్, మండల యూత్ కార్యదర్శి రాథోడ్ చంద్రకాంత్ ఉన్నారు.



నేటి ప్రజావాణి రద్దు

నవతెలంగాణ ఆసిఫాబాద్

జిల్లాలో గ్రూప్ 3 పరీక్షల నిర్వహణ నేపథ్యంలో కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది గ్రూప్-3 పరీక్షల నిర్వహణ, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే విధులలో ఉన్నందున అధికారులెవరు అందుబాటులో ఉండరని దరఖాస్తుదారులు కలెక్టరేట్ కు రాకూడదని పేర్కొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

సోమవారం | నవంబర్ 18, 2024 | www.navatelangana.com

యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన శ్రీరాముల అనుదీప్(30) యువకుడు శనివారం అర్ధరాత్రి ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్ఐ వినీత ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు డ్రైవర్ పని చేసుకుంటూ తన తల్లి ఉమతో కలిసి ఎన్టీఆర్‌నగర్‌లో నివసిస్తున్నాడు. జీవితంపై విరక్తితో గతంలో ఓ సారి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గాయాలపాలై చేతి వేళ్ళు కోల్పోయాడని, అప్పటి నుంచి తనకు పెళ్లి కాదేమోనని మనస్థాపంతో మద్యానికి బానిసయ్యాడు. శనివారం అర్ధరాత్రి మద్యం సేవించిన్ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం తల్లి చూసే సరికి అప్పటికే మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-కాసిపేట



మండలంలో ధర్మారావుపేట యాదవ సంఘం కమిటీ హాల్ పహారీ గోడ కోసం నిధులు మంజూరు చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను యాదవ సంఘం నాయకులు కోరారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్, ముత్యాల రాజమౌళి, చిలువేరి రమేష్, చిన్నవేణి పవయ్య, భాషవేణి కొమురయ్య, చిన్నవేణి రవి, ముత్యాల భూమయ్య లచ్చయ్య, ప్రవీణ్, అనవేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చే దిశగా పని చేస్తాం

- ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు



నవతెలంగాణ-దండేపల్లి

ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తాము పని చేస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని కొర్విచెల్మ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన కొండ గొండ్ల మల్లయ్య అనే వ్యక్తి వలె అగ్నిప్రమాదానికి గురికాగా స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి రూ.10,000 ఆర్థిక సాయాన్ని అందజేసి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విషం వెళ్లగక్కే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు వారి మాటలు నమ్మరని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ బోనస్‌గా ప్రభుత్వం ప్రకటించిన రూ.500 అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడచుకు కల్యాణలక్ష్మి వరం



నవతెలంగాణ-వేమనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పేదింటి ఆడబిడ్డలకు వరం లాంటిదని ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు రూ.4,004,640 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మండలంలోని ప్రతీ ఒక్కరికీ అందేల, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తామని, మండలానికి అవసరమైన రోడ్లు వేయిస్తామని అలాగే ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల గణనలో పాల్గొనాలని తెలియజేశారు. అనంతరం నీల్వాయి, గొర్లపల్లి గ్రామాలలో రూ.30,00,000ల విలువ చేసే ఎస్డీఎఫ్ నిధులతో మంజూరైన సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులను భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్, వేమనపల్లి మండల అధ్యక్షుడు సయ్యద్ షాబీర్‌అలీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట పట్టణంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ విద్యుత్తు లైన్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మత్తులకు ఉత్కుర్ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉచిత కరెంట్ నిలిపేందుకు బీజేపీ కుట్ర

- వేలం పాట రద్దు చేసి బొగ్గు బ్లాకులను సింగరేణికి కెటాయించాలి
- చెన్నూర్ పట్టణంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



నవతెలంగాణ-జైపూర్

వ్యవసాయ విద్యుత్ మోటర్లు, పేదల ఇండ్లకు ఉచిత కరెంట్ నిలిపేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సీపీఐ(ఎం) నాయకులు ఆరోపించారు. బొగ్గు బ్లాకుల వేలం పాటలు రద్దు చేసి సింగరేణికి కెటాయించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చెన్నూర్ పట్టణంలో సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సంధర్బంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో 3వ సారి అధికారాన్ని చేపట్టిన బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు పరిశ్రమను ప్రయివేటు కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి కుట్ర చేస్తుందని అన్నారు. ఈ క్రమంలో బొగ్గు బ్లాకులకు వేలం పాట నిర్వహించడం జరిగిందని ఆరోపించారు. బొగ్గు బావులు పరిశ్రమ ప్రభుత్వం చేతిలో ఉండటం మూలంగా బొగ్గు తయారయ్యే కరెంట్ తక్కువ ధరకు వస్తుందని అన్నారు. ఫలితంగా రైతులు పంటలు పండించడానికి వ్యవసాయ మోటర్లకు పేదలకు ఇండ్లకు యూనిట్ల కరెంటు ఉచితముగా ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కార్పోరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్న బీజేపీ మోడీ ప్రభుత్వం ఉచిత కరెంటును ఎత్తివేసే కుట్రలు చేస్తుందని విమర్శించారు. బొగ్గు బావులను ఆదాని, అంబానీలకు కట్టబెట్టడం కోసం వేలం పాటను నిర్వహించడం జరిగిందని దీన్ని రద్దు చేసి సింగరేణి సంస్థకు కెటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఏరియా కార్యదర్శి బోడంకి చందు, జిల్లా నాయకురాలు దాసరి రాజేశ్వరి, సిడాం సమ్మక్క, నాగ జ్యోతి, రేణుక, సత్యం, శ్రీనివాస్, బొందయ్య భూదక్క, సరిత, రమాదేవి, మధూకర్ పాల్గొన్నారు.

బీసీ సదస్సును జయప్రదం చేయండి

నవతెలంగాణ-మంచిర్యాల



బీసీ వర్గాలను దెబ్బతీస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈ నెల 30న జరగనున్న బీసీ సదస్సును విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల బీసీ భవన్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ కుల వివక్షకు గురైన బీసీ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్ల ఫలాలు అందించాలని రాజ్యాంగం చెబుతుంటే, రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా అగ్రవర్ణ రిజర్వేషన్లు వచ్చాయని బీసీ నాయకులు పేర్కొన్నారు. అగ్రవర్ణ రిజర్వేషన్ల వల్ల నేడు బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పూర్వ పరాలు, బీసీ ప్రజలకు జరుగుతున్న నష్టాల గురించి వివరించడానికి మంచిర్యాల జిల్లా కేంద్రంలో సదస్సు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 30న జరిగే సదస్సులో బీసీ సంఘాల రాష్ట్రస్థాయి నాయకులు వక్తలుగా పాల్గొంటారని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలోని వివిధ బీసీ సంఘాల కార్యకర్తలు బీసీ వర్గాల ప్రజలు ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక కన్వీనర్ వడ్డెపల్లి మనోహర్, బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సీనియర్ బీసీ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, పద్మశాలి సంఘం నాయకులు చలమల్ల అంజయ్య, అఖిల గాండ్ల తెలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, శ్రీరామోజు కొండయ్య, నస్పూరి అఖిల్, రాజన్నచారి, అంకం సతీష్ పాల్గొన్నారు.

లైజన్ సెల్ ఏర్పాటు చేయడం హర్షనీయం



నవతెలంగాణ-నస్పూర్

ఎస్సీ, ఎస్టీ కార్మికుల సమస్యల కొరకు లైజన్ సెల్ ఏర్పాటు చేయడం హర్షనీయమని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆంతోటి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం లైజన్ సెల్ నవంబర్ 12వ తేదీన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి లైజన్ సెల్‌లో సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే 140/2018 రిజిస్ట్రేషన్ పేరుతో ఉన్న ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్‌ను మాత్రమే సంస్థ పరిగణలోకి తీసుకుంటుందని, ఇతర యూనియన్లను పరిగణనలోకి తీసుకోదని తెలిపారు. లైజన్ సెల్ ఏర్పాటు చేయడం అంబేద్కర్ ఆశయాలను సాకారం చేయడమేనని అన్నారు. లైజన్ సెల్‌లో ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ మాత్రమే కాకుండా దివ్యాంగులు, మైనారిటీ, బీసీ, మహిళల సమస్యల పరిష్కారానికి తోడ్పడుతుందన్నారు. కార్మికుల సమస్యలు తెలిపితే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ మెంబర్ ఇరావుల శ్రీనివాస్, లైజన్ ఆఫీసర్ కిరణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ దేగల ప్రవీణ్ కుమార్, బ్రాంచ్ సెక్రటరీలు అంద వెంకటేష్, లక్ష్మణ్, చీఫ్ ఆర్గనైజ్ సెక్రెటరీ వేల్పుల ప్రవీణ్, ఆర్గనైజ్ సెక్రెటరీ కుక్క వాసు, జాయింట్ కమిటీ మెంబర్స్ పెద్దన్న, అశోక్, నర్సింగరావు, రావుల శంకరన్న, దాసు, ఫిట్ సెక్రెటరీలు వెంకటేష్, కమల్, తిరుపతి, శ్రావణ్ పాల్గొన్నారు.

అమ్మ ఒడి అన్నదానం విజయవంతం



నవతెలంగాణ-తాండూర్

అమ్మ ఒడి ఎన్జీఓ అన్నదాత ప్రాజెక్ట్ టెక్నో డాన్స్ అకాడమీ ఆద్వర్యంలో ఆదివారం జరిగిన అన్నదాన కార్యక్రమం విజయవంతం అయింది. ఆకలి తీరుస్తూ బెల్లంపల్లి పట్టణంలో 294వ వారాలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజేష్ కార్వ (ఆలు) జ్ఞాపకార్థంగా మార్వాడి యువ మంచ్, బెల్లంపల్లి వారి పూర్తి సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 200 మందికి అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ వ్యవస్థాపకులు అజ్మీరా మోహన్, మంచిర్యాల జిల్లా బ్రాంచ్ మేనేజర్, టెక్నో డాన్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ హనుమాండ్ల మధుకర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, అమూల్య గన్నెవరం తిరుమలచారి, చెందుపట్ల లింగమూర్తి, ఎండీ యూసుఫ్ పాల్గొన్నారు.

తుడుందెబ్బ జిల్లా మహాసభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

ఉట్నూర్‌లో ఈ నెల 20న నిర్వహించే తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని దేవాపూర్‌లోని కుమురంభీం చౌరస్తా వద్ద తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సంధర్భంగా మండల అధ్యక్షుడు సంద్ర భూమయ్య మాట్లాడుతూ ఉట్నూర్‌లోని ఆదివాసీ భవన్ లో ఉదయం 10 గంటలకు మహాసభ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం నాలుగు జిల్లాల నూతన కమిటీల ఎన్నిక జరుగుతుందని వివరించారు. ఈ జిల్లా మహాసభకు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ ప్రధాన కార్యదర్శి కుర్సింగ తిరుపతి, ఉపాధ్యక్షులు సిడం శంకర్, పల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజనులపై ప్రభుత్వ దాడి హేయమైన చర్య

నవతెలంగాణ-కాసిపేట

గిరిజనులపై ప్రభుత్వ దాడి హేయమైన చర్యని సేవలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతి నాయక్ మండి పడ్డారు. మండలంలోని సోమగూడెంలో ఆదివారం సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో లగచర్లలో గిరిజనులపై జరిగిన దాడికి ప్రభుత్వం బాధ్యత వహిస్తూ రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని, పసి పిల్లలను, మహిళలను తేడా చూడకుండా పోలీసులు గిరిజనులందరిపై వారి ప్రతాపం చూపిస్తున్నారని, ఇది అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వం భేషరతుగా గిరిజనులపై నమోదు చేసిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఈ రేవంత్ సర్కార్‌పై సేవాలాల్ సేన పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యాక్షుడు జాదవ్ గజానంద్ నాయక్, లంబాడితండా(కే) గ్రామ అధ్యక్షుడు బానోతు రాజు నాయక్, బానోత్ పరుశురాం నాయక్, భూక్య రమేష్ పాల్గొన్నారు.

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి 19న ఇంటర్వ్యూ

నవతెలంగాణ-హాజీపూర్

మంచిర్యాల జిల్లాలోని మహాత్మ జ్యోతిభా పూలే వెనకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో తాత్కాలిక పద్దతిన భోధించేందుకు అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఈ నెల 19వ తేదీ మంగళవారం తరగతుల డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఎంజేపీ పాఠశాల, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమాల్లో భోధించేందుకు తెలుగు(పీజీటీ మహిళ-1), ఇంగ్లీశ్(జేఎల్ మహిళ-1), జువాలజీ(జేఎల్ మహిళ-1), సోషల్(పీజీటీ జనరల్-2, మహిళ-1) సబ్జెక్టుల్లో భోధించుటకు అర్హులైన ఉపాధ్యాయులను అవసరముందని తెలిపారు. అభ్యర్థులు సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ), బీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు తరగతుల డెమో, ఇంటర్వ్యూలకు మండలం గుడిపేట ఎంజేపీ పాఠశాలలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ పత్రాలు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

నాసిరకంగా ప్యాచ్ వర్క్స్

నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వారం రోజుల క్రితం ప్యాచ్ వర్క్‌ను చేపట్టారు. ఆ పనులను నాసిరకంగా చేపట్టడంతో వారం రోజులకే రోడ్డు మళ్లీ గుంతలమయంగా మారింది. తాడ్వాయి నుంచి ఎల్లారెడ్డి వెళ్లే రోడ్డు స్థానిక పోలీస్‌స్టేషన్ ముందు కంకర వేసి అవసరమైన డాంబర్ మిలితం లేక పైపై పూతలతో నాసిరకంతో పనులు చేయడం వల్లే రోడ్డు వారం రోజులకే పాడైపోయిందని, సంబంధిత అధికారుల పర్యవేక్షణ సైతం లేకపోవడంతో ప్రజాధనం వృథా అవుతుందని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. పనులు చేపట్టే సమయంలో సంబంధిత అధికారులు కన్నెత్తి చూడకపోవడం అంతర్యమేమిటోనని ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష



నస్పూర్‌లో..

నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల జిల్లాలో గ్రూప్-3 పరీక్ష మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 55 శాతం హాజరు నమోదయింది. జిల్లా మొత్తంగా 15038 అభ్యర్థుల గాను 8304 అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులకు అన్ని సెంటర్లలో వసతులు కల్పించారు. కొంతమంది సూచనలను గ్రహించకపోవడంతో పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఐడి ప్రూఫ్ లను తీసుకురావడం మర్చిపోయారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకున్న ఫోటోలు తీసుకురాకపోవడంతో కొంత ఆలస్యమై నిర్దేశించిన సమయం దాటి ఇంటికి వెనుతిరగాల్సి వచ్చింది. అధికారులు పదేపదే సూచనలు చేస్తున్న కూడా కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని పలువురు తెలిపారు.

పరీక్ష కేంద్రాల వద్ద బారీ బందోబస్తు

పట్టణ కేంద్రంలోని ఆర్బిహెచ్వి స్కూల్, సీవీ రామన్ డిగ్రీ కళాశాల, నస్పూర్‌లోని ఆక్స్ఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లలో ఏర్పాటు చేసిన గ్రూప్-3 పరీక్షా కేంద్రాలను క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేబూరు. పరీక్ష అనంతరం ఎగ్జామ్స్ షీట్స్ స్ట్రాంగ్ రూమ్ తరలింపు గురించి పోలీస్ అధికారులకు సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

264 మంది 223 మంది పరీక్షకు హాజరు

హాజీపూర్ : గ్రూప్-3 పరీక్ష ఆదివారం మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. మండలం వేంపల్లిలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో పూర్తిస్థాయి సౌకర్యాలతో గ్రూప్-3 పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయం 9-30 గంటల లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి చేరగా గేట్లు మూసివేశారు. ఉదయం పూట జరిగిన పరీక్షలో 264 మంది అభ్యర్థులకు 41 మంది గైర్హాజరు కాగా 223 మంది పరీక్ష రాశారు. ఇక మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 2-30 గంటలలోపు పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతించగా ఉదయం హాజరైన అభ్యర్థులు గైర్హాజరు కాకుండా మధ్యాహ్నం పరీక్షకు యదావిధిగా హాజరయ్యారు. గ్రూప్-3 పరీక్షా కేంద్రం వద్ద 500 మీటర్ల వరకు ఎవరూ గుంపులుగా ఉండకుండా 144 సెక్షన్ విధించడంతో పాటు 163 బీఎన్ఎస్ కూడా అమలు చేయగా పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్పాండే పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు మధ్య పరీక్షా జవాబు పత్రాలు స్ట్రాంగ్ రూంకు తరలించారు. కాగా పరీక్షా కేంద్రం వద్ద మెటల్ డిటెక్టర్ ఏర్పాటు చేయగా మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్ ల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.

మందమర్రి : పటిష్ట బందోబస్త్ మధ్య గ్రూప్-3 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 : 30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్షల నిర్వహణ కోసం పట్టణంలో 7 కేంద్రాలను ఏర్పాటు చేసారు. 7 కేంద్రాలలో అల్లాట్మెంట్ అభ్యర్థుల సంఖ్య 2064 కాగా హాజరు శాతం 50కి మించకపోవడం గమనార్హం. 18వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం నుండే పరిక్షా కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. అభ్యర్థుల గుర్తింపు కార్డులు పరిశీలించి లోనికి అనుమతిచ్చారు. ఆలస్యంగా వచ్చిన వారిని సరైన గుర్తింపు పత్రాలు లేని పలువురు అభ్యర్థులని పోలీస్ అధికారులు లోనికి అనుమతించలేదు. మండల విద్యాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ సతీష్, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌లు ఎప్పటికప్పుడు పరీక్షా కేంద్రాలలో పరిస్థితి పర్యవేక్షించారు. బందోబస్త్‌లో 60 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హాజీపూర్‌లో..

అదుపు తప్పి బొలేరో వ్యాన్ బోల్తా

నవతెలంగాణ-కౌటాల



అదుపు తప్పి బొలేరో వ్యాన్ బోల్తా పడ్డ సంఘటన ఆదివారం మండలంలోని ముత్తంపేట్ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమానపల్లి మండలంలోని బాలాజీ అంకోడ వ్యాపారి వాసాల సురేష్‌కు చెందిన బొలేరో వ్యాన్ వడ్ల లోడ్‌తో సిర్పూర్ వైపు వెళ్తుంది. కౌటాల మండలంలోని ముత్తంపేట్ గ్రామ సమీపంలో శిర్షా క్రాస్ రోడ్డు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ లచ్చన్నకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని ఈస్గాం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నాగర్ కర్నూల్‌కు చెందిన బషీరోద్దీన్ అనారోగ్య కారణంతో ఆదివారం మరణించాడు. ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం 1990లో జిల్లాలో సివిల్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన బషీరోద్దీన్ సేవలు ఎంతో గొప్పవని తెలిపారు. బషీరోద్దీన్ అంత్యక్రియలకు తక్షణ సాయం కింద రూ.20000 మంజూరు చేయడంతో పాటు మృతదేహాన్ని ఆయన సొంత జిల్లా నాగర్‌కర్నూల్‌కు పంపించినట్లు తెలిపారు. పోలీస్ శాఖ నుండి వచ్చే బెనిఫిట్స్ త్వరగా వచ్చేలా చూస్తానన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలపడంతో పాటు కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని అన్నారు.

జీవించే హక్కును కాపాడుకోవాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజలు జీవించే హక్కును కాపాడుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భుజంగ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రాంజీ గోండ్ భవన్‌లో మానవ హక్కుల వేదిక 10వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు ఉభయ జిల్లాల అధ్యక్షులు కాంబ్లే అతీష్ కుమార్, మహమ్మద్ సుజిత్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు పాల్గొని మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ప్రజలు జీవించే హక్కులను రక్షించాలని కార్యకర్తలు హక్కుల కార్యకర్తలను ప్రజా కార్యకర్తలుగా భావించాలన్నారు. రాజ్యాంగబద్ధంగా జీవించే హక్కులను ప్రభుత్వాలు ప్రజలకు జవాబు దారిగా తనం నుంచి తప్పించుకుంటున్నామని ప్రజాస్వామ్యం డబ్బులున్న చేతుల్లోకి పోయి నోటు ఓటుగా మారి కార్పొరేటర్‌గా మారిందని అడిగే హక్కులను కోల్పోతున్నామన్నారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా మానవ హక్కుల వేదిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పురుషోత్తమ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపీనాథ్, ఎం.జ్ఞానేశ్వర్, విశ్యామ్ రావు, ఎస్ సూరజ్, ప్రధాన కార్యదర్శిగా సతీష్ కుమార్, కార్యదర్శులుగా బి రాజు, శంకర్ యాదవ్, బి.వినోద్, డి.క్రాంతి, ప్రజ్ఞశిల్ ఎన్నుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు సుజిత్ ఖాన్, ఉపాధ్యక్షులు సిడాం తిరుపతి, ఆత్రం ధర్మారావు, ప్రధాన కార్యదర్శి బి వెంకట్, కార్యదర్శులుగా ఏ.రాజ్ కుమార్, ఎం.అశోక్, ఎం.కమల, శ్రీధర్, సభ్యులుగా సందీప్ కుమార్, కంబాల శేఖర్, షేక్ దస్తగిరి, జే.ధర్మేందర్, కే.దేవేందర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు పాల్గొన్నారు.

పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి

- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల



నవతెలంగాణ-సారంగాపూర్

మహారాష్ట్రలో జరుగబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎన్నికల నియమావళిలో భాగంగా ఏర్పాటు చేసిన సిర్పెల్లి అంతరాష్ట్ర చెక్ పోస్టును ఆదివారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆకస్మికంగా సందర్శించి, చెక్‌పోస్టులలో సిబ్బంది తనిఖీల విధులను పరిశీలించారు. అందులో భాగంగానే అయా చెక్‌పోస్టులలో ఇప్పటికీ వరకు సీజ్ చేసిన నగదు, లిక్కర్, ఇతర వస్తువుల వివరాలను చెక్ పోస్ట్ అధికారులు ఎస్పీకి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలను ప్రభావితం చేయడానికి డబ్బు,మద్యం ఇతర సామాగ్రి చెరవేయటాన్ని చెక్ పోస్టుల ద్వారా వివిధ శాఖల సమన్వయంతో పగడ్బందీగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. మహారాష్ట్ర నుంచి మన రాష్ట్రంలోకి తిరిగే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి తనిఖీల సమయంలో వీడియోగ్రఫీ తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ వెంట స్థానిక ఎస్సై శ్రీకాంత్, చెక్ పోస్ట్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అపన్న హస్తం కోసం ఎదురుచూపులు



నవతెలంగాణ-ఖానాపూర్

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన అమంద కిరణ్(31) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. రోగి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... కడుపు ఉబ్బసం వంటి ఇతర పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న బాధితుడికి ఉండటానికి ఇల్లు లేదని వాపోయారు. ఆస్పత్రిలో చూపించుకోవడానికి ఆర్థిక స్తోమత లేక అద్దె ఇంట్లో నివాసం ఉంటూ నానా ఇక్కట్లు పడుతున్నామని తెలిపారు. మనసున్న దాతలు స్పందించి బాధితునికి చికిత్స అందించేలా ఆర్థిక సాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆర్థిక సాయం చేయాలనుకునే దాతలు సెల్ నెంబర్ 9550227132 గూగుల్ పే, ఫోన్‌పేకు పంపాలని కోరారు.

సమగ్ర కుటుంబ సర్వేకు తాము అర్హులం కాదా..?

నవతెలంగాణ-ఆర్మూర్

గత 25 సంవత్సరాలు నుంచి గుడిసెలు వేసుకుని కూలీ పనులు చేసుకొని జీవిస్తున్న తాము సమగ్ర కుటుంబ సర్వేకు అర్హులం కాదా అని పలువురు ప్రశ్నించారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి హనుమాన్ దేవాలయం వెనుక గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పలువురు బాధితులు ఆదివారం నవతెలంగాణతో మాట్లాడారు. ఎవరు ఎప్పుడు గుడిసెలు తీసేయమంటే అప్పుడు తీసేస్తూ రాత్రి సమయంలో విషపురుగుల సంచారంతో భయాందోళనతో జీవిస్తున్నామని తెలిపారు. ఆధార్ కార్డులు సైతం మార్చుకున్నామని వివరించారు. తమ కుటుంబాల సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పల్లెన్న, సీమ, నవీన్, గంగామణి ఉన్నారు.

మిషన్ భగీరథ..ఏంటిది గోస..

- ఓవర్ హెడ్ ట్యాంకులు అందని తాగునీరు
- చలి కాలంలోను నీటి గోస
- ఆటోలు, ద్విచక్ర వాహనాల ద్వారా నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రభుత్వం తాగునీటి కోసం మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా నీరు అందిస్తున్నామంటూ చెబుతున్న అది కాగితాలకే పరిమితమవటానికి ఇదొక ఉదాహరణ. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి చూశాం కాని చలికాలంలో సైతం తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామమిది. మండలంలోని తేజాపూర్ పంచాయతీ పరిధిలో ఉన్న సాలేగూడ గ్రామమిది. ఇక్కడ మొత్తం 77 ఆదివాసీ కుటుంబాలు నివాసముంటున్నాయి. ఆ గ్రామంలో కాలమేదైన తాగునీటి కోసం ఫర్లాంగు దూరంలో ఉన్న పోలిమెరకు బిందెలు, డబ్బాలు పట్టుకుని వెళ్లాల్సిందే. దీనికి కారణం గ్రామ పొలిమేరలో ఉన్న బోర్‌వెల్ నుంచి ఓవర్ హెడ్ ట్యాంకు వరకు వేసిన



పైప్‌లైన్ లీకేజిల పర్వంగా మారడంతో తమకు తాగునీరు అందడం లేదని గ్రామస్తులు వేణుగోపాల్ పేర్కొన్నాడు.

అందని మిషన్ భగీరథ..

తమ గ్రామంలో ఉన్న ఓహెచ్‌ఆర్ఎస్ ట్యాంకుకు మిషన్ భగీరథ నీళ్ల కేవలం దీపావళి పండగ నాడు వచ్చిందన్నారు. అప్పటి నుంచి ఆ నీళు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తాగు నీటి కోసం ఫర్లాంగు దూరం వెళ్లాల్సిందే..

ప్రతి రోజు తాగునీటి కోసం ఫర్లాంగు దూరం వెళ్లాల్సిందేనని గ్రామస్తులు తెలిపారు. టూ వీలర్ బండి, ఎడ్ల బండి, ఆటోల ద్వారా వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నారు. గతంలో సర్పంచ్ ఉన్నప్పుడు తమ సమస్యలను చెప్పుకునే వాళ్లమన్నారు. ప్రత్యేకాధికారులున్న ప్రస్తుతం తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదన్నారు. గ్రామాల్లో ఇప్పుడు పత్తి సీజన్ ఉంది. ఈ తాగునీటి గోసతో తాము వ్యవసాయ పనులకు దూరంగా ఉంటున్నామని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి తమ గ్రామస్తులు ఎదుర్కొంటున్న తాగునీటి గోసను పరిష్కరించాలని పేర్కొంటున్నారు.

మరమ్మతులు చేపట్టి తాగునీరందించాలి

మడావి నాగోరావ్, గ్రామస్థుడు

మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా నీటిని సరఫరా చేయాలి. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కినక వెంకటి, సాలేగూడ గ్రామస్తుడు.

అన్ని కాలాలు తాము తాగునీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. గతంలో వేసిన పైప్‌లైన్ మరమ్మత్తులు చేపట్టక పోవడంతోనే నీళ్ల రావడం లేదన్నారు. పిల్ల పాపలతో ఫర్లాంగు దూరం నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

పెద్దపులి హల్‌చల్... భయంలో రైతులు

- అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు
- రాజులగూడ గ్రామంలోని రైతుకు చెందిన ఎద్దుపై దాడి



నవతెలంగాణ-నార్నూర్

నాగపూర్ మీదుగా హస్నాపూర్ చాందూరి, నార్నూర్ మండలం శివారులో ఆదివారం పెద్దపులి హల్‌చల్ చేసింది. అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ముందస్తుగా వ్యవసాయ పొలంలో పొలంలో పని చేస్తున్న రైతులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. నాగపూర్ మీదుగా ఈవైపు వచ్చిన పెద్దపులి కలకలంతో పత్తి ఎరుకునే సమయంలో రైతులు కూలీలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదేశాలు ఇచ్చిన అటవీశాఖ అధికారులు అంతలోనే రాజులగూడ గ్రామానికి చెందిన రైతు ఆనంద్‌రావ్ వ్యవసాయ పొలంలో ఎద్దుపై పెద్దపులి దాడి చేసింది. అవైపు నుంచి పెద్ద పులి పాదముద్రను పరిశీలించి, ఏవైపు వెళ్లిందనే కోణంలో అదికారులు రంగంలోకి దిగారు. రెండు రోజులు అటవీ శివారులో ఎవరు కూడా వెళ్లదని సూచించారు.

గ్రూప్-3 పరీక్ష కేంద్రాల తనిఖీ



నవతెలంగాణ-నిర్మల్

టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను ఆదివారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని చాణక్య, సెంట్ థామస్ పాఠశాలలతో పాటు పలు పరీక్ష కేంద్రాలలో గ్రూప్-3 పరీక్షలను ఆమె ఆకస్మికంగా సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష సమయంలో ఏలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతించకూడదని అభ్యర్థులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే పరీక్ష కేంద్రంలోకి వెళ్లేలా చూడాలన్నారు. మొదటిరోజు ఉదయం జరిగిన గ్రూప్-3, పేపర్-1 పరీక్షకు జిల్లా కేంద్రంలోని 24 పరీక్ష కేంద్రాల్లో 8,124 అభ్యర్థులకు గాను, 4,710 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 3,414 మంది అభ్యర్థులు గైరాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట డిపార్ట్‌మెంట్ అధికారి రాథోడ్ సుదర్శన్, పట్టణ తహసీల్దార్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అండర్- 9, 13 బాలబాలికల జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలైన బాలబాలికలకు జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల డైరెక్టర్ ఆమీరుద్దీన్‌తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదరంగం జ్ఞాపక శక్తిని పెంచడంతో పాటు విపత్కర పరిస్థితులలో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. మేధస్సును పెంచే చదరంగాన్ని ప్రతి ఒక్కరూ ఆడాలని సూచించారు. పోటీల ఆర్గనైజర్ ఎన్.స్వామి మాట్లాడుతూ స్థాయిలో ఎంపికైన బాల బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు.



కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సోమేశ్వరరావు, పీఈటీ కృష్ణ చైతన్య, నాందేవ్, సారంగపాణి పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల వనభోజనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి చెందిన ఆర్యవైశ్యులు ఆ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కుటుంబాలతో కలిసి దంతన్‌పల్లి భీమన్న ఆలయానికి ఉసిరిక చెట్టు వనభోజనానికి వెళ్ళారు. ఆలయం వద్ద వివిధ రకాల ఆటలు వండి చిన్న పెద్ద తేడా లేకుండా సరదాగా గడిపారు. ప్రత్యేక బస్సులో కమిటీ ఆధ్వర్యంలో వన భోజనానికి వెళ్ళగా ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రావుల శంకర్, వాసవి సంఘం ప్రతినిధులు అశోక్, వెంకన్న, మురళీ, దిలీప్, వినేష్, సంజు, రాజు, సుగుణాకర్, ప్రమోద్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని బొంబాయి గూడ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు తొంభిరే శంకర్ భార్య విమల ఇటీవలే అనారోగ్యం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు నాయకులు పొట్టి మల్లయ్య, సంజీవ్, శ్రీనివాస్, బండన్న పాల్గొన్నారు.

బీజేపీ సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ సంస్థాగత ఎన్నికల క్రియశిలా సభ్యత్వ వర్క్‌షాప్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్ మాట్లాడుతూ మండలంలో 49 పోలింగ్ బూతులకు సంబంధించిన వాటి నుంచి ఇప్పటివరకు 17 పోలింగ్ బూత్‌లలో మాత్రమే క్రియశీల సభ్యత్వం చేయడం జరిగిందన్నారు. సభ్యత్వం చేసి 32 పోలింగ్ బూత్ అధ్యక్షులు కూడా క్రియశీల సభ్యత్వం చేసి బోథ్ నియోజకవర్గంలో మొదటి స్థానంలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ అసెంబ్లీ కన్వీనర్ కదం బాబరావ్ పటేల్, మండల కన్వీనర్ బోరే రవీందర్, నాయకులు మాధవరావు, నాయకులు పాల్గొన్నారు.

సినిమా రంగంలో శిక్షణకు సువర్ణ అవకాశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాక్ హైదరాబాద్‌లో సినిమా టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ కోర్స్‌లలో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాల పరిమితి 3 నెలలుంటుందని దీనికి ఫీజు రూ.35000 ఉంటుందని పేర్కొన్నారు. సినిమాటోగ్రాఫి, సౌండ్ రికార్డింగ్, వీడియో మేకింగ్, ప్రొడక్షన్ మేనేజమెంట్ తదితర కోర్సులలో శిక్షణ ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు 9866565156, 6281444199 సంప్రదించాలని సూచించారు.

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములు

నవతెలంగాణ-కామారెడ్డి

భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వవద్దని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్ గౌడ్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇస్తుందని వాటిని ఇవ్వద్దని ప్రభుత్వమే బోర్డ్ ద్వారా సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద మరణానికి రరూ.10లక్షలు, సహజ మరణానికి ఐదులక్షలు, ప్రసూతి, వివాహ ఖర్చులకు రూ.లక్ష ఇవ్వాలని, 2009లో నమోదు చేసుకున్న కార్డులను వెంటనే రెన్యువల్ చేయాలని అన్నారు. కొత్తగా నమోదు చేసుకోవాలనుకున్న కార్మికులకు కొత్త కార్డులను వెంటనే నమోదు చేయించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికులకు అందరికీ ఇవ్వాలని, ప్రాజెక్టులు, రోడ్లు, పెద్దపెద్ద కంపెనీలు, ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు, వలస కార్మికులకు అందరికీ స్పెషల్ డ్రైవ్ చేసి కార్మికులకు అందరికీ లేబర్ కార్డులు ఇవ్వాలని, వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ సెంటర్లలో హెల్త్ చెకప్ పేరిట అక్రమ వసూళ్ల చేస్తున్నారని, వాటిని వెంటనే నిలిపివేయాలని అన్నారు. తూతూ మంత్రంగా హెల్త్ చెకప్ చేస్తూ కార్మికులకు లేనిపోని రోగాలున్నాయని భయభ్రాంతులకు గురిచేస్తూ ఒక్కొక్క వ్యక్తి నుంచి 3500 గవర్నమెంట్ ద్వారా తీసుకుంటున్నారని ఇది అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ అనుమతితో ప్రైవేట్‌గా నిర్వహిస్తున్న హెల్త్ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జగదీష్, జిల్లా ఉపాధ్యక్షులు రాజనర్సు, జిల్లా కార్యదర్శి ఈశ్వర్, కోశాధికారి సాయిబాబా, సహాయ కార్యదర్శి బాలరాజు, నాయకులు రాజయ్య, ప్రభు, రాములు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పరీక్ష హాలులో.. కుమారుడు బయట..

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి సెయింట్‌పాల్ హైస్కూల్లో ఆదివారం జరుగుతున్న గ్రూప్-3 ఎగ్జామ్ రాయటానికి ఓ మహిళ ఆమె కుమారుడిని తీసుకొని ఎగ్జామ్ రాసేందుకు ఎగ్జామ్ సెంటర్‌కు వచ్చింది. ఆమె బంధువులెవరూ లేనందున బాబుని ఎగ్జామ్ హాల్‌లోనికి అనుమతించలేదు. అక్కడ డ్యూటీలో ఉన్న స్థానిక ఏఎస్ఐ సలీం బాబు తండ్రి వచ్చేవరకు అతని వద్దనే ఉంచుకున్నాడు. పోలీస్ సేవాభావానికి పరీక్ష రాయడానికి వచ్చిన పలువురు కృతజ్ఞతలు తెలిపారు.